పేయింగ్ గెస్ట్!

కంచర్ల రమణ

రాత్రి పదిగంటలయింది.

ఏవేవో ఆ క్షణంవరకూ పిచ్చిగా ఆలోచిస్తున్న జగన్నాథం ఏదో ఒక నిశ్చయానికి వచ్చినట్లుగా మెల్లగా లేచాడు మంచంమీంచి.

జగన్నాథం యీ మధ్యనే రిటైరయ్యాడు. రిటైరయ్యాక పనేమీ లేకపోవటంతో వట్టిగా తిని కూర్చోవటంతో అతడికి జీవితం బోర్ కొట్టసాగింది. కాలాక్షేపానికి ఏదైనా వ్యాపకం కల్పించుకోవాలని తెగ ఆలోచించసాగాడు.

అతడి ఆలోచనలు కోమలి, కాంతారావుల పైకి మళ్లాయి.

తనను పేయింగ్ గెస్టుగా ఉంచుకుంటున్న కోమలి, కాంతారావుల మధ్య కలహం సృష్టిస్తే—? అదే అతడికి వచ్చిన ఆలోచన.

కోమలికి మొదట్నుంచీ తనంటే యెందుకో కోపం. ఏదో దూరపు బంధుత్వంకొద్దీ కాంతారావు తనను ఆదరిస్తున్నాడుకాని, నిజానికి అతడికికూడా తనంటే గొప్ప అభిమానం లేదు.

కోమలికి, కాంతారావుకు పెళ్ళయి మూడేళ్ళు కావస్తోంది. ఇంకా పిల్లలు కలగలేదు వాళ్ళకు.

వాళ్ళిద్దరిమధ్య తను మనస్పర్థలు సృష్టించాలి!

కోమలి అంటే నెత్తిన పెట్టుకుని పూజించే కాంతారావుచేత ఆమెను చితక దన్నించాలి! ఆమెను వీధిలోకి గెంటించాలి!

అప్పుడుగాని, తనకు కోమలి చూపుతున్న అమర్యాదకు ప్రతీకారం జరుగుతుంది. తనకు బోలెడు కాలక్షేపమూ అవుతుంది.

వెంటనే తన పాత ట్రంక్ అడుగున వున్న పాత ఎక్సర్సైజు పుస్తకంలోంచి ఓ కాయితం చించి, ఎడం చేతి వ్రాతతో వుత్తరం రాయసాగాడు.

"డియర్ మిస్టర్ కాంతారావ్!

నేనెవర్నో అన్న అనవసరమైన ప్రశ్నతో బుర్ర పాడుచేసుకోకుండా, నేను నీ శ్రేయోభిలాషినే అన్న విషయం మాత్రం గ్రహించి, యిక్కడ నేను చెప్పిన విషయాలు మనస్సులో పెట్టుకుని నీ భార్యారత్నం ప్రవర్తనమీద ఓ కన్నేసి వుంచు. నిన్ను ఆరాధించి, పెళ్ళి చేసుకొన్న మునుపటి కోమలి అనుకున్నావేమో? చాలా మారిపోయింది.

పాపం! ఆవిడమాత్రం యేంచెయ్యగలదులే. నీ బ్రతు

కులో సగం ఆఫీసుకు అమ్ముడుపోతే, మిగిలిన సగం నాట కాలకు అంకితమయిపోయిందాయె. ఆవిడ సేవకు యేమి మిగిలింది?

అందుకేతే, వీధగుమ్మం అంటే, యెరుగనావిడ యిప్పుడు ముప్పొద్దులా అక్కడే గడుపుతోంది.

మగాళ్ళుపిస్తే మొగమాటానికైనా వాళ్ళవైపు కన్నెత్తి చూడని ఆ యిల్లాలు యిప్పుడు, మగ పురుగు కనిపిస్తే చాలు అతడు కనుమరుగయ్యేంతవరకు ఆకలి చూపులు చూస్తోంది.

యీ సోదంతా వదిలి, అసలు విషయానికి వద్దాం. ఈ మధ్యనే, యీ వీధిలోకి సన్నగా, యెర్రగా, పొడుగ్గా వున్న ఓ కుర్రాడు వచ్చాడు. ఎవరో, ఏ వూరునుంచి వచ్చాడో నాకు తెలీదు. కాని, అతడ్ని చూపులతో పలకరించడంలోను, నవ్వులతో సత్కరించడంలోను మీ ఆవిడ లోకమే మరిచిపోతోంది.

పరిస్థితి చెయ్యిదాటి పోకముందే, యిల్లు దిద్దుకుంటూ వన్న సదుద్దేశంతో యీ వుత్తరం రాయడం జరిగింది.

ఇట్లు
నీ శ్రేయోభిలాషి."

ఉత్తరాన్ని కవరులోపెట్టి అతికించేముందు రెండు సార్లు చదువుకున్నాడు జగన్నాథం, అది తను రాసేడని ఎవరయినా తెలుసుకోవడానికి అవకాశముందేమోనని.

అది తన దస్తూరి అని తెలుసుకోవడం బ్రహ్మరుద్రాదులకు కూడా తెలీదు.

కాంతారావు మనసులో కోమలి గురించి అనుమాన బీజాలు నాటేందుకు, యీమాత్రం చాలు.

కాంతారావు మొదటి వుత్తరంలోని నిజానిజాల గురించి పరిశీలన మొదలుపెడతాడు.

అనుమానంతో చూసే కంటికి, యేదో ఒక ప్రవర్తన లోపం భార్యలో కనిపించక మానదు. దాంతో అసలు గ్రంథం మొదలవుతుంది. అంతవరకూ అతిసాధారణంగా అవుపించిన భార్య ప్రవర్తనలో కొత్త అర్థాలు అవుపిస్తాయి.

ఈలోపున అగ్నికి ఆజ్యం తోడుచేసినట్టు, తను ఒకటో రెండో యిలాంటి ఉత్తరాలే గుద్దితే, కోమలిని వీధిలోకి నెట్టుతాడు కాంతారావు.

జగన్నాథం తృప్తిగా వూపిరిపీల్చి, ఉత్తరాన్ని దగ్గరలోవున్న పోస్టుబాక్సులో వెయ్యడానికి లేచాడు.

2

ఉదయం పదకొండుగంటల ప్రాంతంలో పోస్ట్‌మాన్ వచ్చి ఓ వుత్తరం కోమలికి అందించి వెళ్ళాడు.

మేడమీద తన గది కిటికీలోంచి చూసాడు జగన్నాథం.

ఆ వుత్తరం తను రాసినదే! జగన్నాథం ఉత్తరాన్ని పోల్చుకొన్నాడు.

ఉత్తరం అందుకుని, కోమలి అటు యిటూ తిప్పి చూసింది, ఎక్కడ్నుంచి వచ్చిందా అని.

ఫ్రం యెడ్రస్ లేకపోవడంవల్ల క్షణం నిరుత్సాహం పొందినా, ఆ తరువాత ఏదో కూనిరాగం తీయడం మొదలుపెట్టింది కోమలి.

ఆ యింటిలో ఒకరికొచ్చిన వుత్తరాలు రెండోవాళ్ళు విప్పి చదివే అలవాటులేదు.

అంచేత కాంతారావు ఆఫీసునించి వచ్చాక చదవడానికి, గదిలో టేబిలుమీద అవుపించేలా పెట్టివుంటుంది అనుకున్నాడు జగన్నాథం.

అతని గుండెలు ఉద్వేగంతో కొట్టుకో నారంభించాయి.

ఒహవేళ తనే ఆ వుత్తరం రాసాడని కాంతారావుకు తెలిసిపోతేనో?...

'తిన్నయింటి వాసాలు లెక్క పెడతావా ఖలుడా?' అంటూ తనని యింట్లోంచి బయటకు నెట్టేస్తాడు.

అప్పుడు తనకేది దారి?

జీవితం చరమదశలో ప్రశాంతంగా సాగిపోతున్న తన జీవనస్రవంతిలో కావాలని తనే కెరటాలు సృష్టించుకోవడం లేదుగదా?

ఏదో చెప్పలేని బాధతో అతని గుండె కలుక్కుమంది.

కాని, మరుక్షణం సమాధానం చెప్పుకున్నాడు తనకు తాను.

తను యేవేవో వూహించుకుని భయపడి చస్తున్నాడు గాని, ఆ వుత్తరం తనే రాసినట్టుగా కాంతారావు ఎలా వూహించగలడు?

దస్తూరి గుర్తించే అవకాశంలేకుండా ఎడమచేతితో రాసాడు. ఇహ, తన పేరు ఎలానూ రాయలేదు. అతడికి ఎందరో స్నేహితులు. వాళ్ళల్లో పైకి స్నేహితుల్లా నటిస్తూ కత్తులు గుండెల్లో బిగబట్టుకుని కూచుని తిరుగులేని దెబ్బ కాంతారావుమీద తీయడానికి మంచి అవకాశంకోసం యెదురుచూస్తున్న శత్రువులు, కొంతమంది ఉండివుంటారు. వాళ్ళమీదకు పోతుంది, అతడి అనుమానం కచ్చితంగా.

అయినా, తనమీద అనుమానబడ్డానికి, తనతో ఏం కక్ష ఉందనుకుంటాడు?

ఆ ఉత్తరం ఓ రసవత్తరమైన నాటకానికి నాంది. అర్థంలేని భయాల్ని గుండెల్లో పేరబెట్టుకుని అనవసరంగా తను పొందే ఆనందాన్ని పాడు చేసుకుంటున్నాడు.

జరగపోయే నాటకంలోని ప్రతి అంశాన్ని అతి దగ్గరలో ఉండి చూసి ఆనందించాలి.

సాయంకాలం అయిదు గంటలకు కాంతారావు ఆఫీసు నుంచి తిరిగి వచ్చేంతవరకూ ముళ్ళమీద కూచున్నట్టుగా గడిపాడు జగన్నాథం.

ఫలహారం తీసుకుని వెళ్ళమని, సాయంకాలం కోమలి రెండుసార్లు కేక వేసి పిలిచినా, "అబ్బాయిని రానియ్యమ్మా! వాడితో కలిసి తింటాలే" అని అన్నాడు.

ఉత్తరం చదువుతుండగా కాంతారావు మొహంలో రంగులు ఎలా మారుతాయో దగ్గరుండి చూడాలి తను!

కాంతారావు ఆఫీసునుంచి వచ్చాడు.

అతడు కాళ్లుచేతులు కడుక్కొని వచ్చేలోపల, పళ్లెల్లోకి ఫలహారం సర్దుతూ, కోమలి జగన్నాథాన్ని కేకేసింది, కిందికి రమ్మని.

బట్టలు వేసుకుని జగన్నాథం క్రిందికి వెళ్ళాడు. ఫలహారం అయ్యాక, బీచికి వెళ్ళాలని అతని ఉద్దేశం.

కాంతారావు టిఫిను తినడం ఆరంభించాడు. జగన్నాథంకూడా తల వంచుకుని, చెంచాతో టిఫిను నోట్లో పెట్టుకోసాగాడు.

"ఇదిగోండి. ఉదయం వచ్చింది" .అంటూ కోమలి కాంతారావుకు ఉత్తరం అందించింది.

టిఫిను తినడం ఆపి, కాంతారావు ఆత్రంగా అందుకున్నాడు ఉత్తరాన్ని. విప్పి చదవసాగాడు.

మామూలుగా అవుపించడానికి శాయశక్తులా ప్రయత్నిస్తూ, జగన్నాథం కాంతారావు మొహాన్ని పరిశీలించసాగాడు ఆసక్తిగా.

జగన్నాథం అనుకున్నట్టుగానే, తగలవలసిన చోట దెబ్బ తగిలింది, కాంతారావుకు.

కాంతారావు మొహం క్షణంలో మబ్బులు మూసిన ఆకాశంలా నల్లగా మారిపోయింది.

ఉత్తరం చదవడం పూర్తి చేసాడు కాంతారావు. మడిచి, జేబులో పెట్టుకుని, మౌనంగా టిఫిను తినడం పూర్తి చేసాడు.

జగన్నాథంకూడా టిఫిను పూర్తి చేసి లేచి చెయ్యి కడుక్కున్నాడు.

"ఎక్కడ్నుంచండీ ఆ ఉత్తరం? ... ఎవరు రాసారండీ?" అడిగింది కోమలి; భర్త చేతులమీద చెంబుతో నీళ్లు పోస్తూ.

కాంతారావు తనంతట తాను ఉత్తరంలోని విశేషాలు చెప్తాడని అంతవరకూ ఎదురుచూసి, నిరాశ చెంది, ఉండలేక అడిగేసింది.

"అబ్బే! ఎక్కడ్నుంచీ లేదు" ఆమె మాటల్ని దాటేసాడు కాంతారావు.

"అదేమిటండీ. ఎక్కడ్నుంచీ లేదని అంటారేమిటి? ఉత్తరం చేతిలో పెట్టుకుని" మొగుడ్ని నిలవేసింది కోమలి.

కాంతారావుకు చిరాకెత్తుకొచ్చినట్టుంది.

"చెప్పింటే నీకాక్కాదూ. ఎక్కడ్నుంచీ లేదని... పైగా నీతో చెప్పాల్సిన విషయాలైతే... నేనే చెప్తానుగా. నువ్వడగడం దేనికి?" కోమలిని గసిరేసాడు.

కోమలి మొహం మాడ్చుకుంది. మూతి బిగించేసుకుంది.

'మొదటి అంకంలోని మొదటి దృశ్యం అయిపోయింది' అనుకుంటూ, "అమ్మా! ఇవిగో నా గది తాళాలు. జాగ్రత్త పెట్టు" అని చెప్పి, వీధికి బయలుదేరాడు జగన్నాథం.

3

మర్నాడు ఉదయం లేచి, కాలకృత్యాలు తీర్చుకుని, కాఫీకోసం దిగువకు వెళ్ళేసరికి, ఆ యింటి వాతావరణమే మారిపోయినట్లనిపించింది జగన్నాధానికి.

కోమలి వంటింట్లో నిశ్శబ్దంగా పని చేసుకుంటోంది. గిన్నెల చప్పుడుమాత్రం విన్పిస్తోంది.

ఆఫీసు పని చేసుకుపోతున్నట్టుగా, తన పనేమో, తనేమో అన్నట్టుగా ప్రవర్తిస్తున్నాడు కాంతారావు.

ఎంతో అవసరమయితే తప్ప కోమలితో మాట్లాడ్డం లేదు.

అదే మునుపైతే, కోమలిమీద కాంతారావు, కాంతారావుమీద కోమలి వేసే జోకులతో, వారి కలగాపులగపు నవ్వులతో ఇల్లు దద్దరిల్లిపోయేది.

చెప్పలేని ఆనందంతో పొంగిపోయాడు జగన్నాథం. తన ఉత్తరం తిరుగులేకుండా పనిచేస్తోంది, అనుకున్నాడు.

కొట్ట వచ్చినట్టుగా మార్పు అవుపిస్తున్నా 'యేమిటమ్మా? అలాగున్నారేం?' అని అడగకపోతే వాళ్ళకి తనపైన అనుమానం కలిగే అవకాశం ఉందని అనుకుని "యేమిటిరా అబ్బాయ్! అలాగున్నరేం అమ్మాయ్?" అన్నాడు జగన్నాథం.

"అబ్బే! ఏంలేదు బాబోయ్! బాగానే వున్నామే" అన్నాడు కాంతారావు. కోమలిగూడా అలాగే అంది.

"అలాగంటే సరిపోతుందనుకున్నార్రా! ఏదో కోల్డ్ వార్ జరుగుతోంది. నాకు చెప్పర్రా అదేంటో" అన్నాడు జగన్నాథం, తను ఆ తగువు ఏదో తెల్చుకుని తీర్చడానికి సిధ్దంగా ఉన్నట్టు.

"అదేంలేదు మావయ్యా!...నీకు గాకపోతే, యెవరికి చెప్పుకుంటాం, సమస్యలేవైనా వస్తే...అయినా నీ దగ్గర

రహస్యాలేమిటి మాకు'' అంది కోమలి.

సంతృప్తి పడ్డట్టుగా మొహంపెట్టి మేడెక్కాడు జగన్నాథం.

రెండు రోజులు గడిచాయి.

మూడో రోజున, మధ్యాహ్నం భోజనాలయాక, ఏదో పుస్తకం తీసి చదవ నారంభించాడు జగన్నాథం, కాలక్షేపం కోసం.

గంటసేపు చదివాక, విసుగు పుట్టింది. వీధివైపునున్న కిటికీ దగ్గరగా ఓ కుర్చీ లాక్కుని వీధిలోకి చూడసాగాడు.

కోమలి వీధి గుమ్మంలో నిల్చుంది. వీధిలోకి అటూయిటూ తేరిపార చూస్తోంది.

పావుగంట గడిచింది. ఓ యువకుడు రోడ్డమ్మట పోతూ, కోమలివైపే రెప్పార్పకుండా చూసాడు.

కోమలికూడా తగ్గలేదు. అతడివైపే రెప్పార్పకుండా చూస్తూ ఉండిపోయింది. పైగా కిసుక్కున నవ్వింది.

ఆ యువకుడుకూడా సమాధానంగా నవ్వాడు. అంతేగాదు. పావుగంట పోయాక, ఏదో పనున్నట్టు, ఇంకోసారి ఆ రోడ్డమ్మటే, కోమలిని కళ్ళతో తినేస్తూ వెళ్ళాడు.

అతడ్ని ప్రోత్సాహించడమే తన ధ్యేయమన్నట్టు, ఆమెకూడా అలాగే చూసింది. అతడు కనిపించినంత మేరా, మెడలు విరుచుకుని, అతనివైపే చూస్తూ ఉండిపోయింది.

సాయంకాలం వరకూ, ఆ యువకుడు అలా బీట్లు వేస్తూనే ఉన్నాడు. కోమలి వీధి గుమ్మాన్ని అంటిపెట్టుకునే ఉండిపోయింది.

జగన్నాథం ఆనందంతో వివశుడయ్యాడు.

'ఏవేవో ఊహించిరాసే బాధ తనకు తప్పింది. జరుగుతున్నది యథాతథంగా రాస్తే, తన ఆశయం నెరవేరుతుంది' అనుకున్నాడు జగన్నాథం.

కాంతారావు పేర్న ఆరాత్రే ఓ ఉత్తరం పోస్టుచేసాడు, అవాళ సాయంకాలం జరిగిందంతా పూసగుచ్చినట్టు రాసి.

4

ఆయువకుడు బీట్లు కొట్టడంతో ఆగలేదు. "హల్లో హౌ ఆర్ యూ?" అంటూనో "బావున్నారా" అంటూనో పలకరింపులు మొదలుపెట్టాడు కోమలితో.

కోమలికూడా వెనుకాడలేదు. చిరునవ్వులు చిలకరిస్తూనో, తమాషాగా జవాబులు యిస్తోనో, అతడ్ని మరింత కవ్విస్తోంది.

క్రమంగా పలకరింపుల స్నేహం, కబుర్లలోకి మారింది. అతడు రోడ్డుమీద, ఆమె వీధి గుమ్మంవద్ద నిల్చుని గంటల కొద్దీ కబుర్లతో కాలక్షేపం చెయ్యసాగారు.

ఒక్క వివరం పొల్లుపోకుండా ఎప్పటికప్పుడు చూసిందంతా ఉత్తరాలద్వారా కాంతారావుకు చేరవేస్తున్నాడు జగన్నాథం.

నవ్వులతో, జోకులతో ఒకనాడు ప్రతిధ్వనించిన ఆ యిల్లు యిప్పుడు ప్రళయం ముందరి ప్రశాంతతవంటి నిశ్శబ్దంతో నిండి ఉంది.

ఎంతో అవసరముంటే తప్ప కోమలి, కాంతారావు ఒకరి కొకరు ఎదురు రావడంలేదు.

ఆమె అంటూ ఒకత్తె ఆయింట్లో ఉందన్న విషయం మర్చిపోయినట్టు ప్రవర్తించసాగాడు కాంతారావు.

ఎవరివల్ల ఏ తప్పు జరుగుతుందో, ఎవరివల్ల ఏ సంక్షోభం లేస్తుందో అన్న భయంకొద్దీ ఒకర్నొకరు తప్పించుకు తిరుగుతున్నట్టు వ్యవహరించ సాగారు.

జగన్నాథానికి మహదానందంగా ఉంది. ఆ యింట్లో జరుగుతున్నదంతా తనవల్లనే!

కోమలి, కాంతారావులమధ్య భయంకరమైన మవునం రాజ్యం చేస్తోంది.

వారంరోజులు గడిచాయి.

'తను ఆశించింది యింతేనా? కేకలు, కొట్లాటలు మచ్చుకన్నా జరగటంలేదు' అని అనుకుంటుంటే, జగన్నాథం కడుపు పొంగు తీరేలా పెద్ద దెబ్బలాట జరిగింది.

జరిగింది పెద్ద దెబ్బలాటే అయినా, దానికి కారణం మాత్రం అతిచిన్నది.

ఆయింట్లో వాడుకోవడానికి రెండు దువ్వెనలున్నాయి. అందులో ఒకటంటే కాంతారావుకు యిష్టం. కోమలికి ఆ పట్టింపు లేదు. అవుపించిన దువ్వెనతో తల దువ్వేసుకుంటుంది.

అవాళ, కాంతారావు ఎప్పుడూవాడే దువ్వెన అగపడలేదు. ముందు వెతకాల్సినచోటల్లా వెతికాడు. కాని లాభంలేకపోయింది.

"దువ్వెనుండాలి. యెక్కడా కనపడదేం?" అడిగాడు కాంతారావు.

"ఇదుగో. ఇందండి" అంటూ రెండో దువ్వెన అందించింది కోమలి.

"అది కాదు నా దువ్వెన" అని పళ్లు కోపంతో నూరుతూ, కోమలి అందించిన దువ్వెన్ని మూలకు విసిరేసాడు.

కోమలి మాట్లాడలేదు. తనుకూడా భర్తకు కావల్సిన దువ్వెనకోసం యిల్లంతా వెదికింది. ఫలితం శూన్యం.

ఓ ప్రక్క ఆఫీసుకు టైం అయిపోతోంది. చిందులు వేయసాగాడు కాంతారావు.

"ఇప్పటికి యిది వాడండి. తరువాత మీ దువ్వెన వెదికి

జాగ్రత్తచేస్తాను" అంటూ మూలనుంచి దువ్వెనతీసి మళ్లా భర్తకు అందించింది.

కాంతారావుకు రక్తం మరిగిపోయినట్టయింది.

"యీ దిక్కుమాలిన దువ్వెన నాకు చూపించకు" అని గట్టిగా అరిచి, కోమలి అందించిన దువ్వెన్ని రెండు ముక్కలుగా విరిచేసి, ఆమె మొహంమీద కొట్టాడు.

కాంతారావు ఎన్నడూ అంత మూర్ఖంగా ప్రవర్తించ లేదేమో, కోమలికి కూడా కోపం పొడుచుకు వచ్చింది.

"ఏదో బంగారం పోయినట్టుగా రెచ్చిపోతారెందుకు? అదే దొరుకుతుంది. సాయంకాలం దొరక్కపోతే, కొత్తది కొందాం" అంది విసురుగా కోమలి.

దాంతో కాంతారావు కోపం తారాస్థాయి చేరుకుంది. "ఏమిటే ఆ సమాధానం? ఏమిటా తలపొగరంట? పోతే కొత్తదొస్తుందా? యివి సంసారి ఆడే మాటలేనా?" యిల్లు అదిరిపోయేలా అరిచాడు కాంతారావు.

"ఎందుకా అరుపులు? నేనేం చేసానని? మనస్సులో ఏవేవో కుళ్లు పెట్టుకుని ఏసాకు దొరుకుతుందా, దెబ్బలాటకు దిగుదామా అని చూసేవాళ్ళకు ఏం చెప్పగలం?"

"ఏమిటే, ఊరుకుంటుంటే మరీ పేట్రేగి పోతున్నావ్? అయితే నేను కుళ్ళు మనిషినటే" అంటూ ఒళ్ళు తెలియని ఆవేశంతో కాంతారావు కోమలి కొప్పు పుచ్చుకుని వంచి, వీపుమీద నాలుగు బాదాడు.

జరుగుతున్న రభస తెలిసికూడా భార్యాభర్తల మధ్య సామరస్యం కోసం ప్రయత్నించకపోతే, వాళ్ళు తన నే విధంగా అనుమానిస్తారో అన్న భయంతో "ఒరేయ్! కాంతారావ్! ఏమిట్రా అఘాయిత్యం? ఆడకూతుర్ని అలా బాదుతున్నావేంరా? ఆడది కంట నీరుపెడితే అశుభంరా" అంటూ దిగువకు వచ్చాడు జగన్నాథం.

"బాబాయ్! నీకేం తెలీదు ఊరుకో. దీనికీ మధ్య మదం ఎక్కువయిందిలే. మొగుడంటే లక్ష్యం లేకుండా జవాబులిస్తోంది. దీన్నివాళ చంపి పాతరవేసేంతవరకూ నాకు కసితీరదు" అంటూ జగన్నాథాన్ని దగ్గరకు రానివ్వ లేదు కాంతారావు.

కోమలి శోకాలు మొదలుపెట్టింది. నూతిలో పడిపోతా నంది. ఉరిపోసుకుంటానంది. నెత్తిమీద కిరసనాయిలు పోసుకుని అంటించుకుని ఛస్తానంది.

కాంతారావు మెత్తబడలేదు.

పెడసరంగా జవాబులిచ్చాడు. "కోమలి చచ్చాక నెల తిరక్కుండానే పెళ్ళిపీటలమీద కూచుంటాను. నాకేం?" అన్నాడు. ఆమె యెప్పుడు ఛస్తుందా? అని యెదురు చూస్తున్నానన్నాడు.

నిజంగా తను అంత రోషంగలదైతే, చేసి చూపాలిగాని మాటలు అనడం దేనికని సవాలుచేసి మరీ ఆఫీసుకు వెళ్ళాడు కాంతారావు గంట ఆలస్యంగా.

కోమలి యే అఘాయిత్యానికి ఒడిగడ్తుందేమోనని ఆ రోజంతా భయంభయంగానే గడిపాడు జగన్నాథం.

నిజంగా, ఆమె అన్నట్టుగా, ఆమె యే సాహసానికో పూనుకుంటే?

ఆ పాపం తనని చుట్టుకుంటుంది.

జగన్నాథం మనస్సు అంతులేని దిగులుతో బరువెక్కి పోయింది.

5

కోమలి యే అఘాయిత్యానికీ పాల్పడలేదు. రెండు రోజులు పోయాక జగన్నాథం మామ్మూలు మనిషయ్యాడు. భయంతో దడదడలాడిపోయిన గుండె కుదుటబడింది.

అయితే, అవాళ్టి దెబ్బలాట ధర్మమా అని, వీధి

గుమ్మంలో నిల్చుని, పరాయి మొగాడితో రోజూ జరిగే కోమలి బాతాఖానీ మాత్రం ఆగిపోయింది.

ఆమెలో వచ్చిన హఠాత్పరిణామం చూసి ఆశ్చర్య పోయాడు జగన్నాథం.

కోమలి వ్యవహారం ఆశించని కొత్తమలుపు తిరగ్గానే ఖిన్నుడయ్యాడు జగన్నాథం.

రెండు రోజులు మతిపోయిన మనిషిలా అయిపోయాడు.

ఇలా వుండగా మూడో రోజు కోమలి మేడమీదకు వచ్చి "మామయ్యగారూ! అలా బజారుకు వెళ్ళివస్తాను. చిన్నపని ఉంది" అంటూ యింటి తాళాలు జగన్నాథానికి అందించి వెళ్ళిపోయింది.

జగన్నాథం మెదడులో చిన్న గంట మ్రోగినట్టయింది.

'తను ఆ కుర్రాడితో మాట్లాడుతున్న సంగతి ఎవరో కనిపెట్టి, తన భర్తకు చేరవేస్తున్నారన్న విషయం ఆమె గ్రహించి ఉంటుంది. అంచేత బజారు నెపం మీద, ఆ కుర్రాడ్ని రహస్యంగా కలుసుకోవడానికి వెళ్ళడం లేదుగదా కోమలి?' అనుకున్నాడు జగన్నాథం.

గబగబ తన గది తలుపులుమూసి, తాళాలు బిగించి వీధిలోకి వచ్చి బజారు ముఖం పట్టాడు.

కోమలి తనను చూడకుండా, ఆమెకు పాతిక గజాల దూరంలో ఆమెను అనుసరించసాగాడు జగన్నాథం.

ఆమె బజారు దాటిపోయింది. మరికాస్త దూరం పోయాక, ఆ కుర్రాడు కనిపించాడు.

తన అంచనా రైటయినందుకు పొంగిపోయాడు జగన్నాథం.

మొహమంతా నవ్వులు చేసుకొని, ఆ కుర్రాడు ఆమెను సమీపించబోయాడు.

కాని, ఆమె సైగ చేసింది. దాంతో ఆగిపోయాడు

బి తరపోయి.

ఆమె ముందుకు సాగిపోయింది. నాలుగడుగులు ముందుకు పోయి, వెనక్కి తిరిగి, అతణ్ణి తనవెనుక రమ్మని కళ్ళతో సైగ చేసింది.

అతడు ఆమె వెనకాలే నడవసాగాడు.

కొంతదూరం పోయాక, గ్రంథాలయం మేడ అవుపించగానే అందులోకి దారితీసింది కోమలి. వెనువెంటనే వెళ్ళాడు కుర్రాడు.

కోమలి తెలివితేటలు మెచ్చుకోకుండా ఉండలేక పోయాడు జగన్నాథం.

ఏ పార్కులోనే, ఏ సముద్రపొడ్డునో, లేక యింకే రహస్య ప్రదేశంలోనో తామిద్దరూ కలిసి అవుపిస్తే, ఎన్నో అనుమానాలకు దోవతీస్తాయి. అదే లైబ్రరీలో అయితే, "నాకేం తెలీదు. కాకతాళీయం" అని దబాయించేయ వచ్చు.

జగన్నాథం కూడా మెల్లగా లైబ్రరీలోకి ప్రవేశించాడు. వాళ్ళను గమనించనట్టే వెళ్ళి, ఏదో పత్రికలు చూస్తున్నట్టు నటిస్తూ వాళ్ళవైపు చూపులు సారించాడు.

కోమలి, ఆ యువకుడు మేగజైన్ సెక్షన్ వదిలేసి బుక్ సెక్షన్‌లోకి వెళ్ళారు.

వాళ్ళు వెళ్ళాక, ఓ నిముషం పోనిచ్చి, జగన్నాథం కూడా అక్కడకు వెళ్ళాడు.

పుస్తకాలు యెంచుకునే నెపంమీద, కోమలి ఆ యువకుడు ఓ పుస్తకాల రేక్ వద్దకు వెళ్ళారు.

రేక్‌కు ఒకవైపు ఆమె, రెండోవైపు అతను నిల్చున్నారు. ఒకర్నొకరు చూసుకోడానికి వీలుగా, మధ్యనున్న పుస్తకాలు కొన్ని తీసి చేతిలో పట్టుకుంది కోమలి.

చప్పుడు చెయ్యకుండాపోయి, ఆమె వెనుకనున్న

రేక్‌ను అడ్డంగా వుంచుకుని, వాళ్ళ సంభాషణ విన సాగాడు జగన్నాథం, వాళ్ళకు కనిపించకుండా.

"మీరీమధ్య మరీ నల్లపూసైపోయారు. గుమ్మంలో అవుపించడంలేదు బొత్తిగా" అన్నాడు ఆ కుర్రాడు.

"ఉష్! గట్టిగా మాట్లాడకు. గోడలకు కూడా చెవులుంటాయి. మన విషయం మా ఆయనకు తెలిసిపోయిందని నాకు అనుమానంగా ఉంది. ముభావంగా ఉంటున్నారంటే, అదీలేదు. మొన్న దువ్వెన దొరకలేదన్న సాకు క్రింద నన్ను పట్టుకుని చితకబాదారు" చెప్పింది కోమలి.

"అయ్యో! నావల్ల మీకెంత కష్టం వచ్చిందండీ" జాలి చూపాడు కుర్రాడు.

"నేను చచ్చిపోయినా ఫరవాలేదు. నిన్ను విడిచిపెట్టను. నా మనస్సుకు నచ్చిన పనిచేసి తీర్తాను" అంది కోమలి.

"నేనూ అంతే! మీతోడిదే నా లోకం. ఇదిగో వాగ్దానం చేస్తున్నాను" అంటూ అతడు చెయ్యి అందించాడు.

అటూ యిటూ చూసి, కోమలి ఆ చెయ్యిని మెల్లగా స్పృశించి వదిలేసింది.

రెండు నిముషాలు ఒకర్నొకరు చూసుకుని గడిపాక "రేపొకసారి యింటివైపు రండి" అంది కోమలి.

"యేం? యెందుకు?"

"చెప్తాను."

"ఎన్ని గంటలకు?"

"మధ్యాహ్నం పన్నెండు గంటలుదాటాక."

"అలాగే!"

"తలుపుతీసి ఉంచుతాను. తిన్నగా తలవంచుకుని వచ్చెయ్యి."

"మీ ఆయన ఉంటారేమో?"

"ఆయన ఉండరు. ఆఫీసులో ఉంటారు. అందుకే రమ్మంటున్నాను."

"మీ మేడమీదాయన ఉంటాడేమో?"

"మధ్యాహ్నం తిండి తిన్నాక, కునుకుతియ్యడం అలవాటు ఆయనకు. సాయంకాలం నాలుగువరకూ మరి లేవడు."

"అలాగే వస్తాను."

"ఒట్టు."

"ఒట్టుదేనికి? తప్పక వస్తాను."

చేతిలో పట్టుకున్న పుస్తకాలు తిరిగి రేక్‌లో పెట్టింది. గబగబా అక్కడ్నుంచి బయటకు వచ్చేసింది కోమలి.

ఆమె వెనుకే, ఆ కుర్రాడు కూడా బయటకు జారుకున్నాడు క్షణంపోయాక.

ఇంకో నిముషంపోయాక, తనూ బయటపడి, అడ్డుత్రోవగుండా యింటికి చేరుకుని, కోమలి వచ్చే సమయానికి ఎప్పటిలా గదిలో కూచున్నాడు జగన్నాథం.

6

మర్నాడు ఆ కుర్రాడ్ని కోమలి యెందుకు రమ్మందో జగన్నాథానికి తెలుసు.

అయినా, కళ్ళారా చూసి, వాళ్ళమధ్య సాగుతున్నది పచ్చిరంకుతనమని నిర్ధారించుకున్నాక, కాంతారావుకు ఉత్తరం రాయాలి, అని అనుకున్నాడు.

మర్నాడు మధ్యాహ్నం పన్నెండు అయ్యేంతవరకూ తమాయించుకోలేనిఉద్వేగానికి లోనయ్యాడుజగన్నాథం.

కోమలి చెప్పిన సమయానికి తను నిద్రపోకుండా మేల్కొని ఉంటే, ఆ కుర్రాడ్ని గుమ్మం వద్దనుంచి అలాగే పొమ్మంటుందేమోనని, ఉదయం కాఫీకోసం

దిగివచ్చినపుడు "రాత్రి ఒక్క పిసరుకూడా నిద్రపట్ట లేదనుకో" అంటూ గట్టిగా ఆవలించాడు.

పదింపావుకు భోజనానికి వచ్చి, చేసాక వెళ్తూ "అబ్బ! రాత్రి నిద్రలేదేమో, కళ్ళు మూరుకుపోతున్నాయ్" అని, జోగుతూ మేడెక్కాడు.

తన నటన ఫరవాలేదనుకుని తనను తాను మెచ్చు కుంటూ, తన గదిలోకి వచ్చి, తలుపులు బిగించి, వీధివైపు కిటికీవద్ద మాటువేసి కూచున్నాడు జగన్నాథం.

ఆ కుర్రాడు టంచనుగా పన్నెండు దాటాక, తలవంచు కుని నేరుగా యింట్లోకి గబగబా నడిచి వచ్చేసాడు.

వెంటనే లేచి దిగువకుపోయి చూద్దామన్న కోరిక గలిగింది జగన్నాధానికి. కాని అణుచుకున్నాడు.

'తనను చూసారంటే పిట్ట యెగిరిపోతుంది. కాస్త సమయం గడవనివ్వాలి'అని అనుకుంటూ అయిదు నిముషాలు ఆగి నిశ్శబ్దంగా తలుపులు తెరిచి దిగువకు వెళ్ళాడు.

గది తలుపులుమూసి వున్నాయి అనుకున్నట్టుగానే. దగ్గరలో వున్న కిటికీ వద్దకు కదిలాడు. అదికూడా మూసి వుంది.

లోకుల కంటిలో పడకుండా మంచి జాగ్రత్తే తీసు కున్నారు అనుకుంటూ వాకిలివద్దనే తచ్చాడాడు కాసేపు.

పావుగంట గడిచాక మేడమీదకు వచ్చాడు. ఇంకో పావుగంటపోయాక, ఆ కుర్రాడు చెదిరిన జుత్తుతోటి వాడిన మొహంతోటి బయటకు నడిచాడు తొందరగా అడుగులేసుకుని.

కాంతారావు కాపురంలో కలతలు లేపడానికి చిన్న అపవాదు లేవదీద్దామనుకున్నాడు, నిరాధారమైనది అయినా.

ఇపుడు తనకు అపవాదులతో పనిలేదు.

కోమలికి ఓ ప్రియుడున్నాడు. మొగుడి కళ్ళు గప్పి, ఆఫీసుకు వెళ్ళిన అదను చూసుకుని, యింకో మొగాడి కవుగిల్లో నలుగుతోంది.

అవాళ జరిగిందంతా కాంతారావుకు తను రాసిన ఆకాశరామన్న ఉత్తరంలో రాసాడు జగన్నాథం.

7

జగన్నాథం రాసిన ఉత్తరం రామబాణంలా పని చేసింది. కోమలి,కాంతారావుల మధ్య టెన్షన్ పెరిగింది.

ఏదో నెపంమీద, కూరలో ఉప్పు యెక్కువైందని ఓ రోజు, తక్కువైందని ఓ రోజు, కోమలిని తిట్టడం ఆమె ఊరుకోక పెడసరంగా జవాబులు చెప్తే, దేహశుద్ధి చెయ్యడం అరంభించాడు కాంతారావు.

రోజుకో వింత, పూటకో విశేషంగా ఉంది కాంతారావు యింటి వ్యవహారం.

ఇప్పుడు కథ యింకో మలుపు తిరిగింది.

కాంతారావు ఆఫీసుకు వెళ్ళాక, జగన్నాథాన్ని పలకరించాలన్న నెపంమీద, మెల్లగా మేడమీధకు వస్తుంది.

"ఏంటమ్మా? అలాగున్నావ్? అబ్బాయి యేమైనా అన్నాడా?" అంటూ జాలిగా పలకరించుతాడు జగన్నాథం.

అంతే!

కాలవ గేట్లు యెత్తేసరికి, పొర్లుకుంటూపోయే నది నీరులా తన గుండెల్లో ఉన్న బాధంతా ఏడుపు కన్నీళ్ళరూపంలో వెళ్ళగక్కుస్తుంది అతనిముందు.

ఏవేవో అనునయ వాక్యాలు పలికి ఆమె దుఃఖాన్ని కాస్త ఉపశమింపజేసి పంపుతాడు జగన్నాథం.

తన మనస్సులో పేరుకొన్న బాధను జగన్నాథంతో చెప్పుకుని ఓదార్పు పొందాలని ఆశించేది, ఒక్క కోమలే

గాడు, కాంతారావుకూడా.

"అలా బజారుకు పోయివద్దాం. రాకూడదు బాబాయ్" అంటూ జగన్నాధాన్ని తనతో తీసుకెళ్ళి, కోమలి ఇప్పుడెంత నీచంగా ప్రవర్తిస్తున్నదో చెప్పసాగాడు కాంతారావు.

అలాంటి సమయాల్లోనే ఓసారి మెరపులాంటి ఆలోచన వచ్చింది జగన్నాధానికి.

భార్యా భర్త లిద్దరూ ఒకరికొకరు తెలియకుండా తమ బాధలు తనతో చెప్పుకుంటున్నారు. వాళ్ళమధ్య కక్షలు మరింత పెరగడానికి, ఆ అవకాశాల్ని ఎందుకు వినియోగించుకోగూడదు?

ఏవేవో సానుభూతి వాక్యాలు చెప్పి పంపే పద్ధతి మార్చేసాడు జగన్నాధం.

ఇప్పుడు కోమలి వచ్చి మాట్లాడితే "వాడి సంగతి నాకు వేరే చెప్పాలిటమ్మా?...దుష్టుడు...వాడినాన్నను నువ్వెరగవు గాని...వాడి బుద్ధులు పుణికి పుచ్చుకున్నాడు. యేమిటో తల్లీ! నీ బాధలు చూస్తుంటే నాగుండె బ్రద్దలయిపోతోంది. ఒక్క మాటమ్మా! నిన్ననే తెలిసింది... వాళ్ళ ఆఫీసువ్యక్తే ఒకాయన నాతో మాటల్లో అన్నాడు. మన వాడికి...ఆఫీసులో ఎవరో అమ్మాయితో చాలా చనువుగా ఉంటున్నాడుట. ఇహ నాటకాలాడ్డానికి వచ్చే ఆడవాళ్ళతో సంబంధం ఉందట.

తల్లీ! ముసలివాడ్ని. నీ మేలుకోరేవాడ్ని. వాచాలత్వం వల్ల ఉండబట్టలేక వాగేస్తున్నాను. మీ ఆయనతో పొరపాటునైనా నోరుజారేవుసుమా. నా కొంప మునుగుతుంది" అంటూ ఆమెతో కాంతారావుమీద కసి, కోపం పెరిగేలా ఉన్నవీ లేనివీ కల్పించి చెప్పసాగాడు.

కాంతారావు వచ్చి మాట్లాడితే "నేనూ చూస్తున్నా

నురా అబ్బాయ్! ఇంతకుముందిలా వుండేదికాదు. తల బిరుసెక్కువైపోయిందిమధ్య. ఆడదన్నది అణిగి మణిగి ఉండాలి. ఆఖరుకు మగాడు చేసిందాంట్లో తప్పున్నా సరే ఎదురు జవాబీయకూడదు. నువ్వు మంచివాడివి కాబట్టి దెబ్బలతో ఊరుకుంటున్నావు. ఇంకో మగాడయితేనా నరికి పోగులు పెట్టడూ'' అంటూ కోమలిమీద అతడికోపం సెగలు పొగలు కక్కేలా చేసాడు.

దాంతో కోమలి, కాంతారావుల మధ్య అగాధం మరింత పెద్దదయ్యింది. ఆ ఇల్లు ఓ చిన్న రణరంగంగా మారిపోయింది.

8

కాంతారావు చేతిలో చచ్చేట్టుగా దెబ్బలుతింటున్నా కోమలి రహస్యంగా తన ప్రియుడ్ని ఎక్కడో కలుసుకుని రావడం, ఒక్కోరోజు ఇంటికే రప్పించి ఆనందించడం మానలేదు.

ఎప్పటికప్పుడు సమాచారాన్ని తన ఉత్తరాలద్వారా కాంతారావుకు తెలియజేస్తున్నాడు జగన్నాథం.

ఒకరోజున కోమలిని వెంబడించి, ఆమె, ఆమెప్రియుడు రహస్యంగా మాట్లాడుకున్నప్పుడు జగన్నాధానికి తెలియ వచ్చిందేమంటే, నాలుగు రోజుల తరువాత, కాంతారావు ఊరుకెళ్తాడు కేంపుమీద. కాంతారావు పై ఊళ్ళోవున్న వారంరోజులూ, కోమలి యింటివద్ద రాత్రి పదిగంటల తర్వాత కలుసుకోవడానికి నిశ్చయించుకున్నారు, కోమలి, కోమలి ప్రియుడు.

ఆ వార్త తెలియడంతోటే, జగన్నాథం మెదడు చురుకుగా పనిచేయడం మొదలుపెట్టింది.

ఇంతవరకూ తను జరిగిపోయిందే ఉత్తరాలద్వారా తెలియజేసాడు.

ఇప్పుడు కోమలి వేసుకొన్న పథకం గురించి కాంతా రావుకు తెలియజేస్తే, అతడేం చేస్తాడో చూడాలి.

కోమలి, కోమలి ప్రియుడు, ఒంటరిగా, నగ్నంగా ఒకరి కౌగిట్లో ఒకరు నలిగిపోతూ, కాంతారావు పడక గదిలో కాంతారావు కళ్ళకు అగపడితే గొప్ప డ్రామా జరుగుతుంది!

కోమలిని, కోమలి ప్రియుడ్ని చావబాదుతాడు కాంతా రావు.

ఆ దెబ్బతో కోమలికి విడాకులు ఖాయం!

జగన్నాథం ఓ కాయితంతీసి యెప్పటిలా ఎడంచేతితో రాయడం ఆరంభించాడు.

"బధుధాయి కాంతారావ్!

మీ ఆవిడ పెద్ద ప్లానులోవుంది. నువ్వు అటు కేంపుకు వెళ్ళగానే, ఇటు తనూ, తన ప్రియుడూ రాత్రి పది గంటలనుంచి తెల్లవారేవరకు తమ కోరికలకు హద్దులేమిటో తేల్చుకోవడానికి నిశ్చయించుకున్నారు. మీ ఆవిడ్ని పట్టి తగినట్టు బుద్ధిచెప్పడానికి అనువైన సమయం యిదే. ఉపయోగించుకో.

ఇట్లు

నీ శ్రేయోభిలాషి."

9

రాత్రి పదిదాటి యిరవై నిముషాలయ్యింది. గదిలో దీపం ఆర్పేసి, చీకట్లో కిటికీకి దగ్గరగా కుర్చీ వేసుకూర్చుని వీధివైపు చూస్తున్నాడు జగన్నాథం.

అవాళ ఉదయమే కాంతారావు వారంరోజుల కేంపు మీద ఊరికి వెళ్ళాడు.

కోమలి, కోమలి ప్రియుడు అనుకొన్న ప్రకారం అవాళ రాత్రి ఆ యింట్లో కలుసుకోవాల్సివుంది.

అరగంట గడిచింది. జగన్నాథానికి విసుగు కలగ నారంభించింది.

'వాళ్ళు తమ ప్లాను మార్చుకోలేదుగదా?' అని అనుకుని, జగన్నాథం నిద్రపోవడానికి లేద్దామనుకుంటుంటే, ఆ కుర్రాడు చప్పుడు చెయ్యకుండా వీధితలుపులు తెరుచుకుని యింట్లోకి ప్రవేశించాడు.

గదిలో కోమలి అతడికోసమే సిద్ధంగా కాచుకుని కూచున్నట్టుంది.

అతడు గదిలోకి వెళ్ళిన మరుక్షణం దభేలుమంటూ మూసుకున్న తలుపుల చప్పుడు విన్పడింది క్రిందనుంచి.

ఆ తరువాత కిటికీలు మూతబడినట్టు చప్పుడయ్యింది.

జగన్నాథం మనస్సు ఏవేవో వూహించుకోసాగింది.

ఆ కుర్రాడు గదిలో కెళ్ళగానే, కోమలిని యెలా కౌగిలించుకుంటాడో, ఆమె తిరుగ అతడ్నించి చిక్కని ఆనందం పొందడానికి అతడ్ని యెలా కవ్విస్తుందో ఓ బొమ్మ అతని కళ్ళముందు ఆడసాగింది.

అరగంట గడిచింది. గంట అయింది. అలా కిటికీలోంచి చూస్తూ, ఆలోచనల్లో తేలిపోతూ కూచున్నాడు జగన్నాథం.

వీధి తలుపులు ఒక్కసారిగా తెరుచుకున్నాయి.

లోనికి అడుగుపెట్టిన వ్యక్తిని చూడగానే, జగన్నాథం గుండెలు ఆవేశంగా కొట్టుకోసాగాయి.

ఆ వ్యక్తి కాంతారావు!

అతని జుత్తు రేగివుంది. బట్టలు బాగా నలిగిపోయి అస్తవ్యస్తంగా ఉన్నాయి. చూపులు తీక్షణంగా వున్నాయి.

కాంతారావు లోనికివచ్చి "కోమలీ! కోమలీ!" అంటూ ముందు మెల్లగా తట్టాడు.

కోమలి బదులు యివ్వలేనట్టుంది. ఇంకోసారి మళ్ళా పిలిచాడు. కాని, ఈసారి కాస్త గొంతు పెంచాడు.

అయినా, ఆమె జవాబివ్వలేదు.

కాంతారావుకు కోపం వచ్చినట్టుంది. తలుపులు గట్టిగా బాదాడు.

గదిలో ఉన్న ప్రియుడ్ని ఎక్కడ దాయాలో, ఎలా బయటకు దాటెయ్యాలో, యేం చెయ్యాలో అర్థంగాక కోమలి సతమతమైపోతూ ఉండవచ్చు.

అందుకే, కాంతారావు పిలవగానే తలుపు తియ్యలేదని ఊహించాడు జగన్నాథం.

ఆఖరుకు కోమలి తలుపు తెరిచినట్టుంది. భళ్లున తలుపుల శబ్దం అయింది.

"ఏమిటి సంగతి? మరీ అంత ఒళ్ళు తెలియకుండా నిద్ర పోతున్నావా?" కాంతారావు కంఠం కరుగ్గా మోగింది.

"అబ్బే...మస్తుగా నిద్రపోయాను...పిలుపు వినబడ లేదు" కోమలి తడబడి పోతోంది. ఆమె కంఠంలో వణుకు, తొట్రుపాటు స్పష్టంగా తెలిసిపోతోంది.

కాంతారావు లోనికి వెళ్ళి, తలుపు ధన్ మనిపిస్తూ మూసేసి గడియలు బిగించాడు.

తలుపులు తెరిచివుంటే, కోమలి ప్రియుడు బయటకు దూకేస్తాడేమో? కాంతారావు ఆలోచన అయ్యుండ వచ్చుననుకున్నాడు జగన్నాథం.

'ఇప్పుడు పెద్ద డ్రామా జరగబోతోంది. యెలా తెలుసుకోవడం?'

అటు యిటూ ఆరాటంగా తిరిగాడు జగన్నాథం.

దిగువకు పోయి తలుపుల వద్దనుంచి విందామను కున్నాడు. కాని మనసు మార్చుకున్నాడు.

ఎవరైనా చట్టున తలుపులు తెరిస్తే, తను వింటున్నట్టు తెలిసి పోతుంది.

ఆఖరుకు ఓ ఆలోచన వచ్చింది.

గది మధ్యకు వెళ్ళాడు. నేలమీద పరచిన తివాసీ ప్రక్కకు లాగేసాడు.

చెవి నేలకు బాగా ఆనించి వినసాగాడు.

జగన్నాథం ఉంటున్న గదికి సరిగ్గా క్రిందనే, కాంతారావు పడక గది వుందేమో, అక్కడ జరుగుతున్న దంతా శబ్దాల రూపంలో తెలియవస్తోంది జగన్నాథానికి.

"ఒరేయ్! ఎవడ్రా నువ్వు? ఇక్కడ నీకేం పనిరా?" కాంతారావు కంఠం కర్కశంగా మ్రోగింది.

కోమలి ప్రియుడు కాంతారావుకు దొరికి పోయాడు మొత్తం మీద, అనుకున్నాడు జగన్నాథం.

"ముందు మర్యాదగా చొక్కా వదులు" అన్నాడు ఆ కుర్రాడు.

ఆ తరువాత కాంతారావు ఆ వ్యక్తిని కొట్టినట్టున్నాడు. ఫట్ ఫట్‌మని దెబ్బలు తగిలినట్టు శబ్దం వినబడింది.

సన్నని మూలుగుతో ఆరంభమయిన కోమలి రోదన తీవ్రమైంది. వెక్కి వెక్కి ఏడుస్తున్న ఆమె కంఠం ఒక ప్రక్క వినపడుతోంది.

కొంపదీసి, యీ కొట్లాట హత్యకు దారి తియ్యదు గదా?

ఆ ఆలోచన రాగానే, జగన్నాథం గుండె నిలిచి పోయినట్టయింది.

ఇలాంటి సందర్భాల్లో, ఒళ్ళు మరిచిపోయి, మొగాళ్లు ఒకళ్ళ నొకళ్ళు కొట్టి చంపుకొన్న కేసులు అనేకం

ఉన్నాయి.

అదే సమయంలో క్రిందనుంచి పెద్ద కేకలు వినబడ్డాయి. అవి, కాంతారావువి.

"అమ్మో! బాబోయ్! తల పగిలిపోయింది. రక్తం... రాక్షసీ! నీ రంకు మొగుడిచేత చంపిస్తున్నావే... నేను చచ్చిపోతాను... కానీ... మిమ్మల్ని వదలను. దయ్యమై మీ యిద్దర్నీ వెంటాడి వెంటాడి... చంపుతాను. నా కసి తీర్చుకుంటాను. చచ్చి సాధిస్తాను. అమ్మా... అయ్యో... అమ్మా!" అంటూ చివర్న పెద్ద కేక పెట్టాడు కాంతారావు భయంకరంగా.

అది ఖచ్చితంగా చావుకేక అన్నది అర్థం చేసుకొన్నాడు జగన్నాథం. చేతులూ కాళ్లూ ఆడడం మానేసాయి. గుండెల్లో వణుకు ఆరంభమయింది.

"రాజూ!... రాజూ... యెంతపని చేశావు రాజూ!" ఆవేశంగా అరిచింది కోమలి.

"నన్ను క్షమించు కోమలీ! ఆవేశంలో ఒళ్ళు తెలియలేదు. టేబిలు మీద రూళ్ళ కర్ర చూడగానే నేనేం చేస్తున్నానో తెలియకుండా పోయింది" రాజు కంగారుగా మాట్లాడాడు. కోమలి రోదిస్తూనే ఉంది.

కాస్సేపయ్యాక రాజు స్థాయిన పడ్డట్టున్నాడు.

"కోమలీ! గడిచిన దానికి విచారిస్తూ లాభం లేదు. ముందీ శవాన్ని యెలాగో లాగు వదిలించుకునే యేర్పాటు చెయ్యాలి" అన్నాడు రాజు.

"నాకేం చెప్పాలో, యేం చెయ్యాలో తోచడం లేదు. నువ్వే ఏదో చెయ్యి ఆలోచించి," అంది కోమలి యింకా యేడుస్తూనే.

"ఇప్పుడు యేం చెయ్యడానికీ లాభం లేదు. రేపు రాత్రి వరకూ ఎలాగో యీ శవాన్ని దాచిపెట్టామంటే,

రేపు దీన్ని వదిలించుకునే ఏర్పాట్లు చేస్తాను.''

''అయితే దీన్ని ఎలా దాచిపెట్టడం?''

''పెద్ద పెట్టె ఏదన్నా ఉందా?''

''ఉంది. ఇదిగో.''

కోమలి పెట్టె చూపినట్టుంది. అది చూసి ''బావుంది. నువ్వు కాళ్ళు పట్టుకో...యెత్తి పెట్టెలో పడేద్దాం'' అన్నాడు రాజు.

ఆ తరువాత కాంతారావు శవాన్ని యెత్తి పెట్టెలో పడేసి, తాళాలు వేసినట్టుగా చప్పుడయింది.

అయిదు నిముషాలు పోయాక–''బక్కెట్టుతో నీళ్ళు, గుడ్డ పట్టా...యీ రక్తం కడిగి పారెయ్యాలి,'' అన్నాడు రాజు.

స్నానాల గదిలోంచి కోమలి నీళ్ళు తెచ్చినట్టుగా శబ్దం అయింది.

ఆ తరువాత, నేలంతా తుడిచినట్టుగా చప్పుడయ్యింది.

''ఆఁ...ఫరవాలేదు. ఇప్పుడు పొడి గుడ్డతో వత్తెయ్'' చెప్పాడు రాజు.

అతడు చెప్పినట్టుగా కోమలి చేసాక, ''ఇహ... నేను వస్తాను జాగ్రత్త'' అన్నాడు రాజు.

''అదేమిటి రాజూ? నువ్వెళ్ళిపోతే యెలా? నన్నీ స్థితిలో వదిలేసి వెళ్ళి పోతావా?'' యేడుపు గొంతుకతో అంది కోమలి.

''అలాగంటే యెలా? రేపు నన్ను యెవరైనా ఇక్కడ చూస్తే యేమనుకుంటారు?'' అన్నాడు రాజు.

''యేమనుకున్నా సరే నువ్విక్కడే ఉండు. ఏదో ఒకటి చెప్పకోవచ్చు. అంతగా యెవరైనా అడిగితే,ఏదో బంధుత్వం చెపుతాను.''

రాజు చివరకు ఉండడానికే నిశ్చయించుకున్నట్టు

న్నాడు. "సరే" అన్నాడు.

ఆ తరువాత సన్నగా కోమలి యేడుపు, ఆరాటంగా అటూ యిటూ పచార్లు చేస్తున్న రాజు పాదాల చప్పుడు వినపడసాగాయి.

10

తూర్పున వెలుగు రేకలు విచ్చుకున్నాయి.

జగన్నాధం రాత్రి క్షణంసేపు కూడా నిద్ర పోలేదు. కాంతారావు హత్య గురించిన ఆలోచనలతోనే గడిపాడు.

దిగువకు పోయి సంగతేమిటో కనుక్కొని రావాలను కున్నాడు గాని, ఆ కోరికను బలవంతంగా అణుచు కున్నాడు.

కాంతారావు హత్యా రహస్యం తనకు తెలిసిందన్న కక్షతో, తనను కూడా వాళ్ళు చంప ప్రయత్నిస్తే?

అసలు రాత్రి యేం జరిగిందో తనకేమీ తెలియనట్టు, తెల్లవారాక వెళ్ళి, కాంతారావు శవం యెక్కడుందో కనిపెట్టి, పోలీసు రిపోర్టు యివ్వడమే సరైన మార్గం అను కున్నాడు జగన్నాధం.

ఎప్పటి వేళకు అంటే ఉదయం ఏడున్నర దాటాక, కాఫీ కోసం దిగువకు వెళ్ళాడు.

రాజు ముందర యెదురయ్యాడు. అతడ్ని చూసి జగ న్నాధం సీరియస్‌గా మొహం పెట్టాడు.

"సిస్టర్! వీరేనేమిటి మీ పేయింగ్ గెస్ట్?" అని అన్నాడు రాజు నవ్వుతూ.

వాళ్ళి జగన్నాధం మనసులో యీసడించుకొన్నా, మొహంలో మాత్రం ఆ భావం కనబడనీయలేదు.

పైగా, తనూ మొహం మీద నవ్వు మొలిపించుకుంటూ "ఆ... నేనే బాబూ! అమ్మాయ్! యీ కుర్రాడు?" అన్నాడు జగన్నాధం, కోమలి నుద్దేశించి.

"మీకు తెలియదులే మామయ్యా! మా పెద్దనాన్న కొడుకు. పెంపకం యిచ్చారులే..యిదే మనవూరు రావడం మొదటి సారిగా" అంది కోమలి.

'ఇంత చాతుర్యం ఎప్పుడు నేర్చుకొన్నావో గాని నువ్వు చాలా ఘటికురాలవమ్మా!' అనుకున్నాడు జగన్నాథం మనస్సులో.

జగన్నాథాని కొకటి, రాజుకొకటి కాఫీ గ్లాసు అందించింది కోమలి.

కాఫీ తాగుతూ, అటూ యిటూ పచార్లు చేస్తూ, కాంతారావు పడక గదిలోకి చూసాడు జగన్నాథం.

అప్పుడే కడిగి, శుభ్రం చేసినట్టుగా ఉంది నేల.

"అబ్బాయి రావడానికి వారం రోజులు పడుతుంది గదూ?" అడిగాడు జగన్నాథం, కాళీగ్లాసు కోమలికి అందిస్తూ, అదే సమయంలో, ఆమె మొహంలోని భావాల్ని చదవ ప్రయత్నిస్తూ.

కాసేపు ఆమె మొహంలో నీడలు ముసిరి, మళ్లా ప్రసన్నమైంది.

"అవును మామయ్యా! అలాగన్నారు మరి, ఎప్పుడొస్తారో యేమో?" అంది కోమలి.

కాంతారావు శవం యెక్కడ దాచారో తెలుసుకొని పోలీసు రిపోర్టు యివ్వాలి అనుకున్నాడు జగన్నాథం.

"ఏమీ తోచక ఛస్తున్నానమ్మా. ఏవైనా పుస్తకాలు తీసుకొంటాను" పైకి అంటూ కాంతారావు పడకగదిలోకి అడుగుపెట్టాడు జగన్నాథం.

కాంతారావు టేబిలుమీద రూళ్ళకర్రవుంది. రాత్రి దాంతోనే దిక్కుమాలిన చావు చచ్చాడు కాంతారావు అనుకొన్నాడు జగన్నాథం.

రూళ్ళకర్ర శుభ్రంగా తోమి కడిగినట్టు తళతళ మెరు

స్తోంది.

గదిలో ఓ మూలనున్న పుస్తకాల బీరువావద్ద నించుంటూనే, గది నలుమూలలా చూపు సారించాడు జగన్నాథం.

ఇంకో మూలనుంది క్రపెట్టె. తాళంవేసివుంది.

ఆ పెట్టెలోనే కాంతారావు శవంవుంది. జగన్నాథం గుండెలు ఆవేశంగా కొట్టుకోసాగాయి.

అదేసమయంలో గోడని వేళ్ళాడుతున్న తాళంచెవి కన్పించింది.

పెట్టెతెరిచి ఒక్కక్షణం కాంతారావు శవాన్ని చూడాలన్న కోరిక అణుచుకోలేకపోయాడు.

అటు ఇటు చూసి, ముందుకు కదిలాడు. తాళంచెవి అందుకొన్నాడు. పెట్టెవద్దకు వెళ్ళాడు.

వంగి, తాళం తీయబోతుంటే, మెడమీద చల్లగా ఇనపముక్క తగిలినట్టు అనిపించి, తలత్రిప్పి చూసాడు.

జగన్నాథం గుండాగిపోయింది.

"ఏరా ముసలినక్కా! ఇందుకా ఇక్కడికొచ్చావ్! సరే! కాంతారావు హత్య చేయబడ్డట్టు నీకు తెలిసిందన్న మాట" జగన్నాథం మెడమీద పిస్టల్ మొన ఆనించి అన్నాడు రాజు.

"అబ్బే! అబ్బే! యేంలేదు" కంగారుగా అన్నాడు జగన్నాథం. ఒళ్ళంతా ఒహాటే చెమట్లు పోయసాగాయి అతనికి.

అతడి చేతిలోంచి తాళాలు లాక్కుని, జేబులో వేసుకొన్నాడు రాజు.

"కాంతారావు నన్ను రెచ్చగొట్టాడు. అందుకేచంపేసాను. మా రహస్యం నీకు తెలిసింది. నువ్వూరుకోకపోతే నీకూ అదేగతి పడ్తుంది. ఏమంటావ్?" రాజు గొంతు కర్కశంగా విన్పించింది జగన్నాథానికి.

తడారిపోయిన గొంతుకతో "అలాగే! నేను చచ్చినా సరే ఈ రహస్యం ఎవరికీ చెప్పను. ఒట్టు, ఏ ఒట్టు వెయ్యమంటే ఆ ఒట్టే వేస్తాను. నేను చచ్చినంత ఒట్టు" అన్నాడు జగన్నాథం.

"సరే! అయితే నీ గదికి ఫో. రెండురోజుల వరకూ బయటికి రాకు. ఎవరితోనూ మాట్లాడకు. తెలిసిందా?" అన్నాడు రాజు, పిస్టల్ తిరిగి తన జేబులో ఉంచుకొంటూ.

"తెలిసింది తెలిసింది" అంటూ మరబొమ్మలా తలాడించి 'బ్రతుకుజీవుడా!' అనుకొంటూ మేడమీదకు ఒక్క పరుగులో వచ్చి పడ్డాడు జగన్నాథం.

జగన్నాథం గుండెల్లో దడ, వణుకు తగ్గలేదు ఎంతసేపయినా.

వెంట్రుకవాసిలో తను మృత్యుముఖంలోంచి తప్పించుకొన్నాడు.

తను చెయ్యగూడని సాహసమే చేసాడు.

హంతకుడు తనమీద ఓ కన్నేసి వుంచాడనీ, సమయం కనిపెట్టి మీద బడ్తాడనీ ఊహించలేకపోయాడు.

కాంతారావు హత్య చెయ్యబడ్డాడన్న విషయం తనకు తెలుసన్న సంగతి వాళ్ళకు తెలుసు.

వాళ్ళేం చేస్తారో తనను!

అనవసరంగా తన ప్రాణాల్ని యిరకాటంలో పెట్టుకొన్నాడు.

'ఇదిగో శవం! ఇడుగో హంతకుడు!' అంటూ పోలీసులకు చెప్పి హంతకుల్ని పట్టిద్దామనుకున్నాడు. కాని బెడిసికొట్టింది.

ఏమీ ఎరగనట్టు, అలా షికారుకుపోయినట్టు పోయి పోలీసు రిపోర్టు యిచ్చివుంటే, పోలీసులే అన్నిసంగతులూ

చూసుకొని వుండేవారు.

కాంతారావు శవం చూడాలనుకొని తను చాలా పెద్ద తప్పు చేసాడు.

మధ్యాహ్నం భోజనానికి వేళ అయినా ఆకలికాలేదు. దిగువకుపోలేదు.

ఒంటిగంట ప్రాంతంలో రాజు పైకివచ్చి "దిగువకు వచ్చి మాట్లాడకుండా భోంచేసి మేడెక్కు" అన్నాడు కోపంగా కళ్ళు పెట్టి.

'ఆకలిగాలేదు. భోంచెయ్యను' అని అంటే, యేం ప్రమాదమో అని నిశ్శబ్దంగా దిగువకుపోయి, అరగంటలో భోంచేసి మేడెక్కాడు జగన్నాథం.

జగన్నాథం గదిలోకి వెళ్ళగానే, తలుపులుమూసి, బయటినించి గడియబెట్టి వెళ్ళిపోయాడు రాజు.

నోటమాట ఉడిగి స్థాణువులా వుండిపోయాడు జగన్నాథం.

11

కిటికీలోంచి వీధిలోకి చూస్తూ కూచున్నాడు జగన్నాథం.

మధ్యాహ్నం మూడవుతుండగా, రాజు ఎక్కడికో వెళ్ళాడు బయటికి.

రాత్రి ఎనిమిది కావస్తుండగా తిరిగొచ్చాడు. వస్తూనే మేడమీదకు వచ్చి గదితలుపులు తెరిచి "అరగంటలో భోంచేసిరా, మధ్యాహ్నంలాగే" అన్నాడు రాజు.

రాజు ఆజ్ఞాపించినట్టుగా, తొందరగా భోజనంముగించి మేడమీదకు చేరుకొన్నాడు జగన్నాథం.

మళ్ళా గడియపెట్టి వెళ్ళిపోయాడు రాజు.

రాత్రి ఒంటిగంట దాటింది.

ఎంత ప్రయత్నించినా నిద్రరాలేదు జగన్నాథానికి.

కిటికీలోంచి అలాగే వీధిలోకి చూస్తూ కూచున్నాడు.

రెండు కావస్తుంటే, ఓ కారు ఇంటిముందాగింది. దాని కున్న మైలో మీటరు చూసి అది టాక్సీ అని గ్రహించాడు జగన్నాథం.

టాక్సీలోంచి ఓ వ్యక్తి బయటకువచ్చి, వీధిలో అటూ ఇటూ కాసేపుచూసి, ఇంట్లోకి ప్రవేశించాడు.

పావుగంట గడిచాక, ఆ వ్యక్తి, రాజు కలసి, ఉదయం జగన్నాథం చూసిన పెట్టెను బయటకు మోసుకొచ్చారు.

అతికష్టంమీద దాన్ని కారు డిక్కీలోకి చేర్చారు.

రాజు, టాక్సీమనిషి లోనికిపోయి కూర్చోగానే టాక్సీ బయలుదేరింది.

కాంతారావు శవాన్ని ఆనవాలుకూడా మిగలకుండా ఎక్కడో పాతిపెట్టయ్యడానికో, ఏ నదిలోనో, చెరువులోనో విసిరెయ్యడానికో తీసుకెళ్తున్నారు. నేరస్తులు చేయిజారిపోతున్నారు.

ఏం చెయ్యడం తనిప్పుడు? తను యీ గదిలో బంధింపబడ్డాడు.

జగన్నాథం పిచ్చివాడిలా గదంతా తిరిగాడు. జుత్తు పీక్కున్నాడు.

తనిప్పుడు గదిలోంచి బయటపడి, వాళ్లెక్కడ శవాన్ని పారేస్తున్నారో తెలుసుకోవాలి.

తలుపు రెక్కలు రెండూ పట్టుకుని ఒక్కసారి గుంజాడు. ఆశ్చర్యం! తలుపులు వచ్చేశాయి.

రాజు బయట గడియలు సరిగ్గా పెట్టలేదు అనుకున్నాడు.

గబగబా వెలుపలకి వచ్చి రోడ్డుమీద పడ్డాడు. అదే సమయంలో అటువైపుగా ఓ కాళీ ఆటోరిక్షా వచ్చింది.

దాన్ని ఆపి, అందులోకి దూకి "నేను చెప్పిన చోటుకు

పోనీ. మీటరు రీడింగు మీద అదనంగా పది రూపాయలు యిస్తాను" అన్నాడు డ్రైవరుతో.

"అలాగే సర్" అంటూ జోరుగా లాగించాడు డ్రైవరు ఆటోని.

ఆ పెట్టెను యేం చేస్తారు? ఎక్కడకు తీసుకుపోతారు? ఆలోచించసాగాడు జగన్నాథం.

శ్మశానంలోకి తీసుకెళ్ళలేరు. అక్కడ శవాన్ని పాతి పెట్టనివ్వరు. శ్మశానం కాపలాదారు ఉంటాడు.

అలాగే నూతిలోనో, గోతిలోనో శవాన్ని తోసెయ్యలేరు. ఎంచేతంటే, ఆ పెట్టె ఎవరికో ఒకరికి అవుపిస్తుంది. పెట్టె వల్ల హంతకుల ఆచూకీ తెలిసిపోతుంది.

కాబట్టి ఎక్కడో రహస్యంగా ఓ బయలు ప్రదేశంలో ఆ పెట్టెను పాతిపెట్టేస్తారు.

మధ్య మధ్య టాక్సీ గురించి భోగట్టా చేస్తూ, ఆటో రిక్షా మీద ఊరు చివరవరకు వచ్చాడు జగన్నాథం.

మరి కాస్త దూరం పోయాక, రోడ్డు వారగా, చెట్ల నీడల్లో ఆపిన టాక్సీ అవుపించింది.

ఆటోని బాగా ముందుకు పోనిచ్చి, అక్కడ దాన్ని ఆపించమని చెప్పి, డ్రైవర్ని తోడు తీసుకుని, టాక్సీ వద్దకు వచ్చాడు జగన్నాథం.

టాక్సీని జాగ్రత్తగా పరిశీలిస్తూ సమీపంలో ఉన్న తుప్పల్లో దాక్కున్నారు, జగన్నాథం, ఆటో డ్రైవరు.

"థేంక్యూ! ఇవిగో అయిదొందలు. శవాన్ని మనం యిక్కడ పాతిపెట్టినట్టుగా పిట్టమనిషికి కూడా తెలియకూడదు" అది రాజు గొంతు.

"అలాగే!" అన్నాడు రెండో మనిషి.

ఆ యిద్దరూ టాక్సీ యెక్కి తిరిగి ఊర్లోకి బయలుదేరారు.

'అంతే, యిక్కడే యెక్కడో ఆ శవాన్ని పాతి పెట్టారన్న మాట' అనుకున్నాడు జగన్నాథం.

తుప్పల్లోంచి వెలుపలికి వచ్చి, ఆటో డ్రైవరు సాయంతో ఆ చుట్టుప్రక్కలంతా గాలించాడు, శవాన్ని పాతిపెట్టిన చిహ్నాల కోసం.

అయిదు నిముషాల్లో వాళ్ళ శ్రమ ఫలించింది.

ఒక చోట, ఏదో కప్పి పెట్టినట్టుగా, కొత్త మట్టి అవుపించింది.

'ఇక్కడన్న మాట శవాన్ని పాతిపెట్టారు' అని అనుకుంటూ, మర్నాడు ఉదయం ఆ స్థలాన్ని పోల్చుకోడానికి వీలుగా నాలుగు రాళ్ళు వరుసగా నేలలో గుచ్చి రోడ్డు మీదకు వచ్చాడు.

ఆటోరిక్షా యెక్కి తిన్నగా పోలీసుస్టేషనుకు పోనిమ్మన్నాడు జగన్నాథం.

12

జగన్నాథం చెప్పిందంతా విని, "ముందు శవాన్ని ఎక్కడ పాతిపెట్టారో చూపండి," అంటూ ఇన్ స్పెక్టర్ సీతాపతి నలుగురు పోలీసులను తీసుకొని బయలుదేరాడు.

జగన్నాథం దోవ చూపిస్తుంటే, పోలీసువేను నిర్ణీత స్థలానికి వచ్చి చేరుకొంది.

దగ్గరలో ఉన్న పసులకాపర్ల సాయంతో ఇన్ స్పెక్టరు సీతాపతి జగన్నాథం చూపించిన స్థలం తవ్వించాడు.

ఎంత లోతుకు పోయినా, జగన్నాథం చెప్పిన పెట్టె గాని, శవం గాని కన్పించలేదు.

జగన్నాథం బిక్కమొహం వేసాడు. ఇన్ స్పెక్టరు సీతాపతి ఆశ్చర్యానికి అంతులేదు. అతనికి కొంచెం కోపం కూడా వచ్చింది.

"కొంపదీసి, రాత్రి మీరు కల గాయలేదు గదా?"

వేళాకోళంగా అన్నాడు సీతాపతి.

"యేటండీ పోలీసు డిపార్టుమెంటంటే అంత యేలాకోలంగా ఉందేటి?" అన్నాడు ఒక పోలీసు.

"లేదండీ నా కళ్ళారా చూసాను. అలాంటి పొరపాటు జరగకుండా ఉండాలనే, గుర్తుగా రాళ్ళు కూడా పెట్టాను" సంజాయిషీగా చెప్పుకున్నాడు జగన్నాథం.

"నేనో విషయం అడుగుతాను చెప్పండి" అన్నాడు సీతాపతి ఓ క్షణం ఆలోచించాక.

"చెప్పండి" అన్నాడు జగన్నాథం.

"వాళ్ళు శవాన్ని ఇక్కడ పాతి పెడ్తుండగా మీరు కళ్ళారా చూసారా?"

"అవును. లేదు."

"మరి శవాన్ని యిక్కడే పూడ్చిపెట్టినట్టుగా యెలా అనుమానించారు?"

"అప్పుడే పెళ్ళగించి కప్పిన కొత్తమట్టినిబట్టి."

"చీకట్లో ఏంజూశారోయేమో చుట్టుపట్ల వెతకండి. శవాన్ని ఇంకెక్కడో పాతి, ఇక్కడ పాతినట్టుగా ఢోకాయిచ్చారేమో?" అన్నాడు ఇన్స్పెక్టర్ సీతాపతి.

జగన్నాథం చుట్టుపట్ల అంతా వెతికాడు, అతి జాగ్రత్తగా.

శవాన్ని పాతిపెట్టినట్టు అనుమానించదగ్గ ప్రదేశమేదీ కన్పడలేదు యెక్కడా.

జగన్నాథం ఆశ్చర్యానికి అంతులేదు.

"ఇప్పటికీ పరిస్థితి చెయిదాటిపోలేదు. హంతకులు యింటిదగ్గర ఉన్నారు. నాలుగు గట్టిగా అంటిస్తే, వాళ్ళే చెప్తారు శవాన్ని యెక్కడ పాతిపెట్టారో" అన్నాడు జగన్నాథం, రెండు నిముషాల తర్వాత ఆశ్చర్యంలోంచి తేరుకుని.

"సరే! పదండి" అంటూ వేను ఎక్కాడు సీతాపతి. అందర్నీ ఎక్కించుకుని, వేను ఊర్లోకి బయలుదేరింది.

జగన్నాథం చూపిన యింటి ముందు పోలీసు వేను ఆగింది.

జగన్నాథం లోనికి దారితీయగా, వెంట ఇన్‌స్పెక్టరు సీతాపతి, పోలీసులు వెళ్ళారు.

"యేమిటి మామయ్యా? యేంజరిగిందేమిటి? పోలీసులున్నారేమిటి నీ ప్రక్క?" అడిగింది కోమలి మొహం మీద ఆశ్చర్య ముద్రతో.

"ఇదిగో యీవిడా, యీవిడ ప్రియుడూ కలసి కాంతారావును హత్య చేశారు" అని ఆమెవైపు తిరిగి "యేడీ ఆ రాజుగాడు?" అని అడిగాడు జగన్నాథం.

"యేమిటి మామయ్యా? రాత్రి కలగాని కనలేదు గదా... రాజేమిటి? నేనేమిటి? మా ఆయన్ని హత్య చెయ్యడమేమిటి?" అంది కోమలి, యింకా ఆశ్చర్యం మొహంలో కన్పరుస్తూనే.

కోమలితో యింకేమీ మాట్లాడ్డం యిష్టంలేక సీతాపతి వైపు తిరిగి "మెత్తగా అడిగితే చెప్పరులెండి. నాలుగు తగల్నియ్యవలసిందే," అన్నాడు జగన్నాథం.

సీతాపతి ముందుకు వచ్చాడు.

"చూడమ్మా! మీరూ, మీ ప్రియుడు రాజు కలిసి మొన్నరాత్రి మీఆయన కాంతారావుగార్ని హత్యచేసారని ఈయన కంప్లెయింట్ ఇచ్చాడు మాకు. నిజానికి పాతిపెట్టిన జాగా చూపారు గాని, చీకట్లో చూడ్డం వల్లనో యేమో, సరైన జాగా చూపలేక పోయారు. అయినా, హత్య జరిగితే హంతకులు యెక్కడకు పారిపోగలరు? శవాన్ని యెక్కడ మాయం చెయ్యగలరు? మీరు నిజం చెప్పేసి, మాపని సులువుచెయ్యడం మంచిది"

అన్నాడు ఇన్‌స్పెక్టర్ సీతాపతి.

"ఏమిటి సార్! ఏమిటి జరిగింది?" అంటూ రాజు లోపల్నుంచి గదిలోకి వచ్చాడు.

అతడ్ని చూస్తూనే "వీడే సార్! హంతకుడు. కాంతారావును మూళ్ళకర్రతో తల బ్రద్దలు కొట్టి చంపింది వీడే సార్!" అన్నాడు జగన్నాథం ఆవేశంగా.

"మిస్టర్ రాజూ! యు ఆర్ అండర్ అరెస్ట్" అని రాజుతో చెప్పి, పోలీసులవైపు తిరిగి "అరెస్ట్ హిమ్" అని ఆజ్ఞ జారీచేశాడు సీతాపతి.

చేతులకు అరదండాలు తగిలించడానికి పోలీసులు ముందుకు కదులుంటే "ఏమిటి సార్! గొడవ?" అంటూ కాంతారావు అక్కడకు ప్రవేశించాడు.

అతడ్ని చూస్తూనే జగన్నాథం మొహం పాలిపోయింది.

"ఒరే! నేను చూస్తున్నది కలా? నిజమా? కాంతారావ్! నువ్వు బ్రతికే వున్నావురా" అంటూ అతడ్ని సమీపించాడు జగన్నాథం.

"వాట్ మిరాకిల్ కాంతారావు! మీరు చచ్చిపోయారనేగా ఈ ముసలాయన రిపోర్టిచ్చింది?" అంటూ అమితాశ్చర్యం ప్రకటించాడు ఇన్‌స్పెక్టర్ సీతాపతి.

"యస్ సర్! నేను హత్య చెయ్యబడ్డాననే యీ ముసలాయన రిపోర్టు యిచ్చింది" చెప్పాడు కాంతారావు.

"ఎలా జరిగిందంతా? మీరందరూ కలిసి మా డిపార్టుమెంటుని ఆటలు పట్టించాలనుకోలేదు కదా?" అన్నాడు ఇన్‌స్పెక్టర్ సీతాపతి, కోపంతో అందరివైపు చూసి.

"దయచేసి కాసేపు అలా కుర్చీలో కూచున్నారంటే మీకంతా చెప్తాను" అన్నాడు కాంతారావు, ఓ కుర్చీని సీతాపతికి చూపుతూ.

సీతాపతి కుర్చీలో కూర్చున్నాడు. కాంతారావు రెండు నిముషాలసేపు ఇంట్లోకి వెళ్ళి, చేతిలో ఉత్తరాలతో తిరిగి వచ్చాడు.

"ఇవి చూడండి. వీటిని ఈ ముసలినక్క నాకు రాసాడు," అంటూ సీతాపతికి ఉత్తరాలు అందించాడు కాంతారావు. వాటిని చూడగానే జగన్నాథం గతుక్కుమన్నాడు.

సీతాపతి ఉత్తరాలని చదివి తిరిగి ఇచ్చేస్తూ "కానీ వీటిని ఈయనే రాసాడని తార్కాణం యేమిటి?" అన్నాడు.

"అవన్నీ ఓ పాత ఎక్సర్‌సైజు పుస్తకంలోంచి చించి తీసిన కాయితాలు...ఒప్పుకుంటూరా?"

"అవును" అంటూ తలాడించాడు సీతాపతి.

"అయితే మేడమీద జగన్నాథం గదిలో పాత ట్రంకులో ఓ పాత ఎక్సర్‌సైజు పుస్తకం వుంది. దాంట్లోవి ఈ కాయితాలు. కావలిస్తే చెక్ చెయ్యండి."

జగన్నాథం గదికి ఓ పోలీసుని పంపి, కాంతారావు చెప్పిన పుస్తకాన్ని తెప్పించి, అందులోని కాయితాలతో పోల్చి చూసాడు ఉత్తరాల్ని. సరిపోయాయి.

"కాని, మిస్టర్ కాంతారావ్! నాకో సందేహం. ఈ సంగతి యెలా కనుక్కున్నారు?"

"నా భార్యశీలాన్ని అనుమానాస్పదం గావిస్తూ, అతడు రాసిన ఉత్తరం అందగానే, నాకెందుకో అతడి మీదే అనుమానం కల్గింది. అతడు అలా షికారు కోసం బయటకు వెళ్ళగానే, మా యింట్లో ఉన్న అతడి తాళాల సాయంతో, అతడి గది తెరచి చూసాను. నా అనుమానం దృఢ పడింది. అయితే అంతటితో అతడ్ని వదిలివెయ్యడం నా కిష్టంలేదు. అతడు చేసిన పని యెంత ప్రమాదభరితమో

తెలియ జెయ్యాలనిపించింది.

“అలాంటి సమయంలోనే, ఊరినుంచి మా బావ వచ్చాడు. అతడు యెప్పుడూ మా యింటికి రాలేదు_ ముఖ్యంగా, జగన్నాథం మా పేయింగ్ గెస్ట్ అయ్యాక. అతన్ని రిసీవ్ చేసుకోవడానికి రైల్వేస్టేషనుకు వెళ్ళి నపుడు నాకు కొత్త ఆలోచనలు పుట్టుకొచ్చాయి.

“అతడ్ని అలాగే హోటలుకు తీసుకు వెళ్ళాను. అతడు మా యింటికి వచ్చి ఆడాల్సిన నాటకం అంతా వివరంగా చెప్పాను. కోమలికి కూడా జరగ వలసినదంతా చెప్పాను.

“కోమలీ, నేనూ కొట్లాడుకుంటున్నట్టు రోజూ నాట కాలు ఆడాం. కోమలికి కూడా నాటకాల్లో అనుభవం ఉందేమో, తన నటనతో ఎంతో రక్తి కట్టించింది నాటకాన్ని.

“ఒకరి సంగతి ఒకరికి తెలియనట్టు, ఆయన దగ్గరకు పోయి మా గోడు వెళ్ళ బోసుకుని, ఆయన సలహా అడిగే వాళ్ళం. మాలో మాకు కక్షలు యింకా పెరిగిపోయేటట్లు మా యిద్దరికీ సలహా లివ్వసాగాడు.

“ఆయన సలహా పాటించి మేమిద్దరం ఎలా బద్ధ వైరులుగా మారిందీ నటించాం.

“ఒక స్త్రీ శీలం మీద అనుమానం కలిగిస్తూ భర్తకి ఉత్తరాలు రాస్తే, పరిణామాలెలా వుంటాయో అతనికి తెలీదో, లేక తెలిసే చేసాడో నాకు తెలీదు.

“అందుకే నేను కేంపుకి వెళ్తున్నట్టు, రాజును యింటికి రమ్మన్నట్టు కోమలి చేత చెప్పించాను.

“ఆ రాత్రి మా యిద్దరికీ దెబ్బలాట జరిగినట్టు ఆ కొట్లాటలో నేను హత్య చెయ్యబడ్డట్టూ నాటకం ఆడాం.

“వెంటనే పోలీసుల్ని పిలుస్తాడను కున్నాంగాని, అలా జరగలేదు.

"అందుకే నాటకాన్ని యింకా పొడిగించాం. పెట్టెను ఊరవతలకు తీసుకుపోయి పాతిపెట్టడం వగైరా తమాషా చ్రేసాం.

"జగన్నాథం మా నాటకంలో పడిపోయాడు. మిమ్మల్ని తీసుకొచ్చాడు," అంటూ ముగించాడు కాంతారావు.

"మిస్టర్ జగన్నాథం, మీరింత న్యూసెన్సుగా తయారయ్యారన్న మాట. ముందు స్టేషనుకు పదండి. కొన్నాళ్లు కటకటాలు లెక్కబెడితే బుద్ధి వంకర కాస్త తగ్గుతుంది" అంటూ జగన్నాథాన్ని వేను యెక్కించుకుని తీసుకుపోయాడు ఇన్స్పెక్టర్ సీతాపతి.

—:ఐపోయింది:—